




నూతన సంవత్సరం సందర్భంగా లేపాక్షి ఆలయంలో పర్యాటకుల సందడి

అటకెక్కిన డిఎఫ్ఓఆర్ఎల్ ప్రాజెక్టు

- ప్రారంభం కాని పనులు
- హడావుడితోనే సరి
- రైతులకు చేకూరని లబ్ధి



ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

జిల్లాలో సాగులో ఉన్న ఉద్యానవన పంటలు, వేరుశనగ పంటకు అదనపు విలువ కల్పించే ఉద్దేశంతో డిఎఫ్ఆర్ఎల్ సంస్థ ముందుకొచ్చింది. జిల్లాలో పండే టమోటా, బత్తాయి పంటల నుంచి ఇతర ఉత్పత్తులు తయారు చేసి రైతుకు అదనపు ఆదాయం అందే విధంగా చూస్తామని ప్రకటించింది. ఈ మేరకు 2020 సంవత్సరంలో డీఎఫ్ఆర్ఎల్ అధికారులు జిల్లాలో పర్యటించారు. ప్రయోగాత్మకంగా మూడు ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా టమోటా ప్రాసెసింగ్ పరిశ్రమ ఉంది. టమోటా కెచప్, టమోటా పొడి చేసి విక్రయాలు చేసే సాంకేతిక పరిజ్ఞానం అందిస్తుంది. అదే విధంగా బత్తాయి, వేరుశనగ వాల్యూ ఎడిషన్ చేయడం ద్వారా రైతు ఆదాయం పెంచొచ్చని సూచించింది. అందుకు అనుగుణంగానే జిల్లాలోపై మూడు పంటలు అత్యధిక విస్తీర్ణంలో పండుతున్నాయి. ఈ హడావుడి అంతా మూణ్నాళ్ల ముచ్చటగా సాగింది. ఇప్పటికీ ఆ ప్రకటన వచ్చి మూడు సంవత్సరాలు అవుతున్నా పట్టించుకున్న వారు లేరు. ధరలేక పంటను రైతులు రోడ్డుపై పారబోసే పరిస్థితి ఏర్పాడుతోంది. ఇప్పటికైన పాలకులు పంటలకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు. పంటలకు వాల్యూయాడెడ్ పరిశ్రమలు స్థానికంగా వస్తే రైతుకు ప్రయోజనం కలుగుతుందంటున్నారు.



వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు రావాలి చంద్రశేఖర్ రెడ్డి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావాలంటే స్థానికంగా.వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు రావాలి. ఆ విధంగా వచ్చేందుకు ప్రభుత్వ సహకారం అందివ్వాలి. ప్రధానంగా జిల్లా ఉద్యానవన పంటలకు రావాల్సి ఉంది . ఈ పంటలకు ఒక్కోసారి ధర లేక రైతులు పొలాల్లోనే పంటను వదిలేసే పరిస్థితి ఉంటుంది. హార్టికల్చర్ హబ్‌లు అని ప్రకటనలు కాకుండా చిత్తశుద్ధితో ప్రభుత్వాలు వాటి ఏర్పాటుకు కృషి చేయాలి.

కోటి ఆశలతో...

సరి'కొత్త'గా..!



మంత్రి సవితకు శుభాకాంక్షలు చెబుతున్న తహశీల్దార్

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద సందడి
- ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. కోటి ఆశలతో సరి'కొత్త' ఆకాంక్షలతో ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా అందరూ సంతోషంగా వేడుకలు జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 2024కి టాటా చెప్పి 2025కు స్వాగతం పలికారు. బుధవారం ఉదయం ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలుపుకున్నారు. చిన్నారులు కొత్త దుస్తులు ధరించి తోటి మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజకీయ పార్టీ నాయకుల నివాసాలు సందర్శకులతో కిటకిటలాడాయి. తమ అభిమాన నాయకునికి శుభాకాంక్షలు చెప్పేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. అధికారులు కూడా వారి ఉన్నత శాఖ అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం అధికారులు, ప్రజలు, సందర్శకులతో కిక్కిరిసింది.

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రే యువత వేడుకలను చేసుకుంది. కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బుధవారం ఉదయం మిత్రులు, బంధువులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకుల ఇళ్ల వద్ద ఆయా పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులుదీరారు. దీంతో వారి ఇళ్ల వద్ద సందడి నెలకొంది. అనంతపురం, శ్రీసత్యసాయి కలెక్టరేట్లు పెద్ద సంఖ్యలో అధికారులు, ప్రజలతో నిండిపోయింది. అనంతపురం కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, సత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్‌లను పలువురు అధికారులు, రాజకీయ పార్టీలు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అందరు ఎమ్మెల్యేల నివాసాల వద్ద వారి అభిమానుల కోలాహలం కన్పించింది. ఇతర రాజకీయ పార్టీల నాయకుల ఇళ్ల వద్ద కూడా అదే సందడి కన్పించింది. తమ అభిమాన నేతలకు పూలబొకేలు, స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



నూతన సంవత్సరం సందర్భంగా ఎల్‌కెపిలో నిర్వహించిన కార్యక్రమంలో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు



సాగు చేసిన కందిపంట

కందికి ముసురు దెబ్బ..!

రాలిపోతున్న పూత

ప్రజాశక్తి-అమడగూరు

ఇప్పటికే వేరుశనగ పంటను నష్టపోయిన రైతులకు తుఫాన్ దెబ్బకు కంది పంట కూడా చేతికందకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి. వరుసగా ఒకదాని తరువాత ఒకటిగా వస్తున్న తుఫానులతో నాలుగు, ఐదు రోజుల పాటు ముసురు వర్షాలు పట్టుకున్నాయి. జులై నెలలో సాగుచేసిన కందిపంట ప్రస్తుతం కాయదశలో ఉంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పెట్టిన పంట పూతదశలో ఉంది. మరో నెల రోజుల్లో పంట చేతికి వచ్చే అవకాశం ఉన్న సమయంలో వరుస తుఫానులుతో పూతరాలిపోతోంది. తెగుళ్ళ, పురుగుల బెడద తీవ్రమైంది. కందికాయలు నల్లబారాయి. ఈ పరిస్థితుల్లో దిగుబడి సగంకూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తూన్నారు. ఈ ఏడాది మండలంలో 935 ఎకరాలలో కందిపంటను సాగుచేశారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షభావం కారణంగా కందిపంట ఏపుగా పెరగలేదు. ఆగస్టు నుంచి వర్షాలు కురవడంతో కందిపంట కాస్త చెట్లు పెరిగాయి. దిగుబడి బాగా వస్తుందనుకున్న సమయంలో తుఫాన్ రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ఫెంగల్ తుఫాను నుంచి కోలుకుంటున్న తరుణంలో బంగాళాగతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడడంతో మండలంలో మూడు రోజులుగా ముసురు వాతావరణం కొనసాగింది. ఈ పరిస్థితుల్లో కంది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చేతి వరకు వచ్చిన పంటను ముసురు వర్షాలు పాడుచేస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కందిపంట నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త భర్త మంగళవారం రాత్రి విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడని, మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు మండల కన్వీనర్ జె.వి రమణ ,కో కన్వీనర్లు టి. అయుబ్ ఖాన్, ఎల్ ఆదినారాయణ, సెక్టార్ లీడర్లు ఫాతిమా, చింతమ్మ మాట్లాడుతూ ధర్మవరంలోని ఎల్‌సికె పురం సెక్టార్‌లో పనిచేస్తున్న అంగన్వాడి వర్కర్ అరుణ భర్త ధనుంజయ (40) మంగళవారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతిచెందాడన్నారు. ఇంటిపెద్దదిక్కు పోవటంతో ఆ కుటుంబం వీధినపడిందన్నారు. స్థానిక ఎర్రగుంట సర్కిల్లో. బార్బర్ షాప్ నడుపుకుంటూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండే ధనుంజయ మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిందన్నారు. ప్రభుత్వం స్పందించి మృతునికుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్ని, లక్ష్మీనరసమ్మ ,వెంకటలక్ష్మి, రహమత్, కమల, ఆశాబి, కల్పవల్లి, తులసి, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు 'మధ్యాహ్న భోజనం' ప్రారంభం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ప్రభుత్వం జనవరి నెల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇకనుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇది ఒక వరంలాగా మారిందని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 6,220 మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇటీవల ఉచితంగా పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు అందజేయడం, ఇప్పుడు విద్యార్థుల చదువును దృష్టిలో ఉంచుకొని చదువుతోపాటు వారి ఆకలిని తీర్చేందుకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహించడం అభినందించదగ్గ విషయమని తెలిపారు.

బిసి సెల్ నాయకుడికి సన్మానం

ప్రజాశక్తి - కొత్తచెరువు

వైసిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులుగా కొత్తచెరువుకు చెందిన నారాయణను ఇటీవల అధిష్టానం నియమించింది. ఈ నేపథ్యంలో బుధవారం వైసిపి స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భర్త రెడ్డప్ప రెడ్డి, వైసిపి నాయకులు దాల్‌మిల్ సూరి, వాల్మీకి శంకర్, వెంకట రాముడు, కేశవ, గిరిబాబు, కిష్టప్ప, అశోక్, మనోహర, నారాయణస్వామి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్పీని కలిసిన ఉద్యోగ సంఘాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు ఎస్పీకి పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఏడాది సంతోషంగా సాగాలని ఎఎస్పీ ఆకాంక్షించారు.

క్యాలెండర్ విడుదల

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ టిఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ విడుదల చేశారు. బుధవారం కలెక్టరేట్లో ఆ సంఘం నాయకులు కలెక్టర్‌ను జాయింట్ కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ భాస్కర్ రెడ్డి, కార్యదర్శి రామాంజనేయ యాదవ్, తాలూకా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి విబి రమణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు వై. ఫక్రుద్దీన్, జిల్లా కార్యదర్శి సభ్యులు మల్లికార్జున, ఆదినారాయణ, వెంకటేష్‌తో పాటు ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురం అధ్యక్షులు పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను, డైరీకి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. కదిరి డివిజన్ కన్వీనర్‌గా శ్రీరాముల నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో బుధవారం పట్టణంలో శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు అధ్యక్షతన మండలంలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ప్రసన్న లక్ష్మి, రామక్రిష్ట, ప్రసాద్ నాయక్, శివశంకర, హరి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలోని బాలాజీ నగర్‌లోని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, కార్యదర్శి డి. నరసింహప్ప, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప, గుడిబండ మండల అధ్యక్షులు మూడ్ల గిరియప్ప, నాయకులు నరసింహమూర్తి, మహంతేష్, సురేష్, నరసింహరాజ్, దత్తాత్రేయ, వేదాచలం, ఓబన్న, దేవరాజు, రామకృష్ణ, తిమ్మరాయప్ప, వెంకటరమణ నాయక్, మల్లికార్జున, నంజప్ప, సూర్యప్రకాష్ ,అశోక్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన అభ్యంతరాల స్వీకరణ గడువు పొడిగింపు

ధర్మవరం టౌన్ : ఎస్సీ కుల గణన అభ్యంతరాల స్వీకరణ గడువును కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి ఏడవ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీవో సాయి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణన అభ్యంతరాలు జనవరి 11న నమోదు అవుతుందని, తుది కుల గణన సర్వే వివరాలు జనవరి 17న వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. ఈ కుల గణన అభ్యంతరాల స్వీకరణ గడువు డిసెంబర్ 31వ తేదీతో ముగియడంతో కలెక్టర్ మరోవారం రోజులు పాటు పొడిగించడం జరిగిందని తెలిపారు. ఎస్‌ఒసి విధివిధానాల తెలుపుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 265 విడుదల చేసినట్లు చెప్పారు.

యుటిఎఫ్ పూర్వ నాయకులకు

ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 5,6,7,8 తేదీల్లో కాకినాడలో స్వర్ణోత్సవ మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో జిల్లా నాయకులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పూర్వపు నాయకులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని బుధవారం అనంతపురంలో నిర్వహించారు. ఇమామ్ సాహెబ్, టి.ఈశ్వరయ్య, రామచంద్రారెడ్డి, సాయినాథ్ బాబు, నాగేంద్రబాబు, ఓబులేసు, రామకృష్ణ, సి.ఈశ్వరయ్య, భాస్కర్, వేణుగోపాల్ రెడ్డిలను సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వపు నాయకులు మాట్లాడుతూ యుటిఎఫ్ అనేక పోరాటాలు ఉద్యమాలు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన రాయితీలు, వసతులు, ఆర్థికపరమైన అంశాలను సాధించగలిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అవసరమైన సమయాల్లో అండగా నిలవడంలో ముందున్న సంఘం అని కొనియాడారు. అప్రెంటిస్ రద్దు, పిఆర్‌సి విషయంలో ఉపాధ్యాయుల హక్కులు కాపాడడంలో యుటిఎఫ్ ముందుండి పోరాటాలు చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడంలో అనేక ఉద్యమాలు చేసిందన్నారు. గత నాయకుల స్ఫూర్తితో సంఘాన్ని బలోపేతం చేసి రాబోయే రోజుల్లో ఉద్యోగ ఉపాధ్యాయులకు అండుగా యుటిఎఫ్ నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప, సరళ, జిల్లా కార్యదర్శులు ప్రమీల, సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, ఆడిట్ కమిటీ చంద్రమోహన్, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్ నాగేంద్ర ఆడిట్ కమిటీ సభ్యులు రాజశేఖర్ గంగాధర్ వివిధ మండలాల నాయకులు లక్ష్మీదేవి, చంద్రారెడ్డి, వెంకట నాయుడు వీరేశ్వరాచారి, మహమ్మద్ గౌస్, ఇక్బాల్, కొండప్ప, సిద్దన్న, ఓబుళపతి, శ్రీరాములు, రామచంద్ర, దస్తగిరి పాల్గొన్నారు.



పూర్వపు యుటిఎఫ్ నాయకులను సన్మానిస్తున్న ప్రస్తుత యుటిఎఫ్ నాయకులు

రాయలసీమ అభివృద్ధి మండలి ఏర్పాటు చేయాలి

జలసాధన సమితి నాయకులు



2017లో జలవనరుల శాఖ రూపొందించిన నదుల అనుసంధానం ప్రాజెక్టు రూపాన్ని చూపిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అట్టహాసంగా ప్రకటించిన గోదావరి–బనకచర్ల లింకు ప్రాజెక్టు ఎవరి ప్రయోజనాల కోసం తెరపైకి తెచ్చారో ప్రజలకు వివరించాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో జలసాధన సమితి నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా జలసాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ధనాపురం వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి,నాయకులు, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు అట్టహాసంగా ప్రకటించిన గోదావరి–బనకచర్ల లింకు ప్రాజెక్టు అస్పష్టంగా, గందరగోళంగా ఉందని అన్నారు. 80 వేల కోట్ల రూపాయలతో పిపిపి పద్ధతిలో మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామంటూ బాబు చేసిన ప్రకటనపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. పిపిపి పద్ధతిలో సాగునీటి ప్రాజెక్టు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఎవరు వసూలు చేసుకుంటారు...? ఎవరి నుండి వసూలు చేస్తారు...? నీటిఛార్జీలు పెడతారా...?అని ప్రశ్నించారు. 'రాయలసీమకు నీటిని తీసుకుపోవడానికి అన్ని పార్టీలు అంగీకరించిన పోతిరెడ్డి పాడు వంటి ప్రాజెక్టు తో పాటు నాలుగు దశాబ్దాల కిందట ప్రారంభించిన హంద్రీనీవా ప్రాజెక్టును నేటికీ పూర్తి చేయలేదన్నారు. పాలకులు మారుతున్నా ప్రభుత్వాలు మారుతున్నా హంద్రీనీవా ప్రాజెక్టు నేటికీ అస్తవ్యస్తంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం శ్రీశైలం డ్యాం నుంచి 127 టీఎంసీ వరద నీరు సముద్రం పాలవుతున్నాయన్నారు. కేవలం 40 టిఎంసిల నీటి కోసం రూ. 80 వేల కోట్లు వెచ్చించి, ప్రాజెక్టులు తెరపైకి తీసుకురావడం వెనక ఆంతర్యం ఏమిటి అన్నారు. ఒక్క హంద్రీనీవా కాకుండా రాయలసీమలో అన్ని ప్రాజెక్టులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. ఇదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక జీవోను తీసుకొని వచ్చి శ్రీశైలం ప్రాజెక్టు 854 అడుగుల నుంచి 834 అడుగులకు తగ్గించారన్నారు. దీనివల్ల రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులపై ప్రభావం పడిందన్నారు. ప్రాజెక్టును రూపొందించిన సమయంలో 3850 క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రారంభించారని అయితే నేటికీ 15 క్యూసెక్కుల నీటి సామర్థ్యమే ఉందని అన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 1.05 కోట్లు ఖర్చు చేశారనిఅయితే ఇందులో రాయలసీమకు వెచ్చించి ఖర్చు చేసింది కేవలం రూ.15 వేల కోట్లు మాత్రమే అని అన్నారు. రాష్ట్రంలో 45 శాతం భూభాగం ఉన్న ప్రాంతం రాయలసీమ అన్నారు. 55 శాతం భూభాగం ఉన్న సర్కారు జిల్లాలకు రూ 90 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. సర్కారు జిల్లాల్లో గోదావరి నది జలాలు పుష్కలంగా ప్రవహిస్తున్న ఈ ప్రాంతంలో ఇంత ఖర్చు చేయాల్సిన అవసరం ఉందా అని ప్రశ్నించారు. ప్రస్తుతం గొల్లపల్లి రిజర్వాయర్ లో పూర్తిస్థాయిలో నీరు ఉందని అయితే మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులకు నీళ్లు మళ్లించాలంటే కాలువలను శుభ్రం చేసి, చిన్న చిన్న మరమ్మతులను పూర్తి చేయడానికి రూ. 1.50 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు అందించినప్పటికీ నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. ఈ ప్రాంతంలో హిందూపురం శాసనసభ్యులుగా ఉన్న బాలకృష్ణ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి అని, పెనుగొండ నియోజకవర్గానికి మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నారని అన్నారు. ఇక మడకశిర శాసనసభ్యులు ఎంఎస్ రాజు ఉన్నారన్నారు. ఈ ముగ్గురు ఈ విషయంపై ఒక్కసారి కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా మూడు నియోజకవర్గాల శాసనసభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హంద్రీనీవా కాలువలో పూడికతీత పనులను పూర్తి చేయించి, చెరువులకు నీరు మళ్లించాలన్నారు. దీంతోపాటు 2009 లో వరదలు వచ్చిన సమయంలో శ్రీశైలం ప్రాజెక్టుకు గొయ్యిపడిందని ఇది మరమ్మతు చేయాలంటే రూ. 10 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు వేశారని అన్నారు. 16 సంవత్సరాలు అవుతున్న రూ. 10 కోట్లు విధులను ఈ ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. వాటన్నింటిని వదిలేసి ఇంత భారీ ఖర్చుతో ఈ ప్రాజెక్టును హడావిగా తెరమీదకు ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. 2012లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో 371జె 118 వ రాజ్యాంగ సవరణ చేసి రాయలసీమతో పాటు తెలంగాణకు ఆనుకుని ఉన్న కళ్యాణ కర్ణాటక జిల్లాలకు అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయితే కర్ణాటక రాష్ట్రం వారు అభివృద్ధి మండలి ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చేసుకున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో ఈ విషయంపై ఏ ఒక్కరు కూడా చర్చించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రాయలసీమ అభివృద్ధి మండలిని ఏర్పాటు చేస్తూ శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. దీంతోపాటు విభజన చట్టంలో వెనకబడిన జిల్లాల అభివృద్ధికి కేటాయించిన నిధులను తీసుకొని వచ్చి రాయలసీమ జిల్లాలను అభివృద్ధి చేయాలన్నారు. లేనిపక్షంలో జలసాధన సమితి ఆధ్వర్యంలో రాయలసీమ వ్యాప్తంగా ప్రజా జాతను ఏర్పాటు చేసి సమస్యలను రైతులకు వివరించి, కనీస మద్దతు ధర కోసం పంజాబ్ రైతుల ఉద్యమ స్ఫూర్తితో రాయలసీమ వ్యాప్తంగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే వరకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు సిద్దారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్ గంగిరెడ్డి, జలసాధన సమితి నాయకులు జమీల్, అమానుల్లా, ఉమర్ షారుఖ్ ఖాన్, శ్రీరాములు, ఆదినారాయణ, పరిగి నవీన్, తిప్పి స్వామి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన నాయకుల గృహాలు


ఎమ్మెల్యే పరిటాల సునీతకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు


ఎమ్మెల్యే, మాజీ మంత్రికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ప్రజాశక్తి విలేకరులు

ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డికి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ వన్ టౌన్ సి.ఐ నాగేంద్ర ప్రసాద్, టూటౌన్ సి.ఐ రెడ్డెప్ప, ఎస్ఐలు, తహశీల్దార్లు ధర్మవరం నటరాజ్,తాడిమర్రి భాస్కర్ రెడ్డి,బత్తలపల్లి స్వర్ణలత తదితరులు చిలకం మధుసూదన్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కొత్తచెరువు. మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. టిడిపి నాయకులు పుట్టపర్తి లోనే ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే సింధూర రెడ్డికి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టపర్తి రూరల్: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి క్యాంపు కార్యాలయం నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా జనసందోహంతో నిండిపోయింది. నియోజకవర్గంలోని పలువురు తెలుగుదేశం, నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి, మాజీ మంత్రి పల్లే రఘునాథ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, మామిళ్లకుంట క్రాస్ కాంట్రాక్టర్ చంద్రశేఖరప్ప , కప్పల బండ, లెక్కల గోపాల్, వెంకట గారి పల్లి, శంకరప్ప, సర్పంచు లక్ష్మీదేవి ఓబులేసు,కొట్లపల్లి, జగన్ ,రామయ్య, జగరాజు పల్లి, వనం కష్ణారెడ్డి, వైకుంఠ, బత్తలపల్లి పెడపల్లి శ్రీరామ్ నాయక్, బొమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నివాసంలో నూతన సంవత్సర వేడుకలను ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

చెన్నేకొత్తపల్లి : నూతన సంవత్సరం సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నివాసం జన జాతరను తలపించింది. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం వెంకటాపురంలోని ఇంటితోపాటు అనంతపురంలోని క్యాంప్ కార్యాలయానికి అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి ఎమ్మెల్యే సునీతకు, పరిటాల శ్రీరామ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పెనుకొండ :2025 నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి సవితకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని టీడీపీ నాయకులు, సవిత అభిమానులు,పెనుకొండ నియోజకవర్గ ప్రజలు కూటమి నాయకులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. నియోజవర్గ ప్రజలు ఈసారి వినూత్నంగా మంత్రి కి పూల బొకేలు, పూల దండలు లేకుండా పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మొక్కలు బహుమతిగా అందించారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

లేపాక్షి : నూతన సంవత్సరం సందర్భంగా మండలం కేంద్రంలోని దుర్గా వీరభద్ర పాపానసేశ్వర నంది ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మడకశిర రూరల్ : వైసిపి వక్కలిగా కమిటీ అధ్యక్షులు రంగే గౌడ్ ఇంటి వద్ద జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో మడకశిర వైసిపి సమన్వయకర్త ఈరలకప్ప పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు వీరితోపాటు నాయకులు నరసింహమూర్తి కంచప్ప లక్ష్మీనారాయణ పద్మనాభ కొండంపల్లి రాజు జక్కేపల్లి హరీష్ తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి అర్బన్ : నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రజాప్రతినిధులకు అధికారులకు శుభాకాంక్షలు

జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు

తెలపడానికి ప్రజలు క్రింది స్థాయి అధికారులు బారులు తీరారు. బుధవారం కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు శుభాకాంక్షలు చెప్పడానికి అధికారులు జిల్లా కలెక్టరేట్ కు భారీగా తరలివచ్చారు. అలాగే పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డికి మాజీ మంత్రి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలపడానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టిడిపి నాయకులు కార్యకర్తలు అధికారులు టిడిపి పార్టీ కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి ఎవరు పుష్పగుచ్చాలు, పూల హారాలు తీసుకురావద్దని శాసనసభ్యురాలు, కలెక్టర్ రేట్ నుంచి ముందుగానే సమాచారం అందడంతో చాలామంది మొక్కలను, నోటు పుస్తకాలు, పెన్నులు తదితర వస్తువులు అందజేశారు. అలాగే సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ కు పూలమాలలు, బొకేలతో ఆయన అభిమానులు పలువురు నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

హిందూపురం : హిందూపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సవాల నడుమ జరిగాయి. పలువురు కేకులు కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కాగా బుధవారం ఉదయం నుండి నేతలు, ఉన్నతాధికారుల కార్యాలయాలు సందర్శకులతో కిటకిటలాడాయి. తమ నేతలు, అధికారులకు బొకేలు, పూలమాలలు, పండ్లు, స్వీట్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జిలు రాజ్యలక్ష్మి, లలితా లక్ష్మిని పలువురు న్యాయవాదులు, న్యాయస్థానాల సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు వడ్డే అంజనప్ప ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నేత వేణు రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు నాయకులు నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్నారు. దీనికి తోడు మాజీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయంలో సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, జనార్ధన్ తదితరులు ఏపీపీ ఇందాద్ తో కేక్ ను కట్ చేయించారు. ఇకపోతే మాజీ ఎమ్మెల్యే సీసీ వెంకటరాముడును తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పూలమాలలు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలా ఉండగా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుండి చర్చి నిర్వాహకులు చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చర్చిలో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అదే విధంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


హిందూపురంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు



చిలకం మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు

నేరాలు ఘోరాలు

కల్తీ కల్లు దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని కల్తీ కల్లుదుకాణలపై అనంతపురంఎక్సజ్ శాఖ సిఐలు హరికృష్ణ, సుజనా ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా మందులను వినియోగించి తయారీ చేస్తున్న కల్తీకల్లు విక్రయం సమస్యగా మారింది. కొంతమంది వ్యాపారులు స్వచ్ఛమైన కల్లులో ప్రాణాంతక మత్తు పదార్థాలు కలిపి, ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. ఈ పరిస్థితిని నియంత్రించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా ఎక్సైజ్ అధికారులు బోరెడ్డిపల్లి రహదారిలో లో అక్రమంగా తరలిస్తున్న 1305 లీటర్ల కల్తీ కల్లును పట్టుకొని కేసు నమోదు చేశారు. కల్తీ కల్లు తయారుచేసిన భవనంలో నిల్వ ఉంచిన కల్లును ధ్వంసం చేశారు. పరిగిలో కల్తీకల్లు అమ్మకాలు చేపడుతున్నారని స్థానికుల సమాచారం మేరకు అధికారులు దాడులు నిర్వహించారు. అనధికారికంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేసి, అనుమతులు లేని దుకాణాలను గుర్తించారు.


ధ్వంసం చేసిన కల్తీకల్లు

కర్నాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మండల పరిధిలోని మార్లపల్లి క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజు తెలిపారు. బుధవారం పుట్టపర్తి మండలంలో పలుచోట్ల అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకొని 35 (90యం యల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఉమా మనోహర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న పోలీసులు

కోడి పందెం జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని జూరుకువాండ్లపల్లి గ్రామ శివార్లలో కోడిపందెం ఆడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ వలిబాషా తెలిపారు. గ్రామ శివార్లలో కోడి పందెం జరుగుతోందన్న సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి నాలుగు కోడి పుంజులు రూ. 18 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈసందర్భంగా ఐదుగురిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రంగ, పోలీసులు శ్రీనివాసులు, మురళిబాష, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎస్‌టియు రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్, పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ ,నాయకులు మోతిలాల్, వెంకటరమణా నాయక్, చెన్నా నాయక్, సురేష్ ,వెంకటరమణ, లక్ష్మన్న, వర్మ ,రవిచంద్ర, ఎంఇఒ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు .

కొత్తచెరువు : ఎస్‌టియు రూపొందించిన క్యాలెండర్, డైరీ, పదోతరగతి మెటీరియల్‌ను డీఈవో క్రిష్టప్ప బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్, అసోసియేషన్ అధ్యక్షులు జవహర్, ఉపాధ్యక్షులు ప్రసాద్, సుధాకర్, జిల్లా కార్యదర్శి సంపత్ కుమార్, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి మడకశిర

మండల పరిధిలోని కల్లుమరి పంచాయతీ కి చెందిన వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో 50 కుటుంబాలు పసుపు కండువా కప్పుకొని తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో కల్లుమరి సర్పంచి నాగరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాంచజన్య శ్రీనివాసులు



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-హిందూపురం

పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పాంచజన్య బ్రిలియంట్స్ ఉన్నత పాఠశాల అధ్యక్షులు పిఎస్ శ్రీనివాసులు, కరస్పాండెంట్ డిఎస్ నందకుమార్ పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో నర్సరీ, ఎల్‌కెజి, యూకెజి విద్యార్థులతో కిండర్ గార్టెన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలు, యోగా తదితర అంశాలపై కూడా అవగాహన కల్పిస్తూ తీర్చిదిద్దుతున్నామన్నారు. నేటి సమాజంలో మనుగడకు అవసరమయ్యే రీతిలో విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల యాజమాన్యం అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల నడవడిక పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని ముందుకెళ్లాలన్నారు. అనంతరం నర్సరీ, ఎల్.కే.జీ, యూకేజీ చిన్నారులు ప్రదర్శించిన సందేశాత్మక నృత్యాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు యాజమాన్యం విద్యార్థుల నడుమ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు స్మిత, నందిత, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, సహాయ ప్రధానోపాధ్యాయులు శశికళ, సతీష్ కుమార్, అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు వెంకటేశ్వరరావు

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


ప్రజాశక్తి-పెనుకొండ

క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత జన్మదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గస్థాయి సవితమ్మ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోటీలు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. అనంతరం సవితమ్మ ఫాలోయర్స్ క్రికెట్ జట్టు సేవా మందిర్ జట్ల మధ్య పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరామ్ యాదవ్, మైనార్టీ నాయకులు షౌకత్, త్రివేంద్ర, బాబుల్ రెడ్డి, రమణమ్మ, చంద్రకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ కార్యాలయాల కోసం ప్రత్యేకంగా తీసుకువచ్చిన క్యాలెండర్ ను కలెక్టర్ టిఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు క్యాలెండర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల, ప్రభుత్వం దృష్టికి తెస్తున్న ప్రజాశక్తి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం డిఆర్ఓ విజయ సారథి, పెనుకొండ ఆర్డీవో ఆనందబాబుతో పాటు డి పి ఆర్ ఓ వేలాయుధం తదితరులు క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం టిడిపి కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా క్యాలెండర్లు విడుదల చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది శ్రీనివాసులు, పుట్టపర్తి, కొత్తచెరువు పాత్రికేయులు బసప్ప, మహేష్, సాయి ప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




పుట్టపర్తిలో ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ దృశ్యాలు

రిటైర్డ్ డిఇఒకి సన్మానం

ప్రజాశక్తి - బుక్కపట్నం

రిటైర్డ్ డిఇఒ, వైసిపి మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షులు రాచం రెడ్డి భాస్కర్ రెడ్డిని బుధవారం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. మండల కేంద్రంలోని వాల్మీకి రామాలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించినందుకు శాలువా, గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన సొంత గ్రామం అభివృద్ధికి, దేవాలయాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని, రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


రిటైర్డ్ డిఇఒని సన్మానిస్తున్న నాయకులు


టిడిపిలోకి చేరిన హైదర్‌వలితో ఎమ్మెల్యే కందికుంట

వైసిపి మండల కన్వీనర్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - నల్లచెరువు

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో నల్లచెరువు మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వైసిపి మండల కన్వీనర్ హైదర్ వలి బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసందర్భంగా హైదర్‌వలికి ఎమ్మెల్యే కందికుంట పార్టీ కండువా కప్పి వైసిపిలోకి ఆహ్వానించాడు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు శివారెడ్డి,మాబు సాబ్, అంజినప్పా, వేణు, నరసింహులు, గంగులప్ప, మౌలాలి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'కందికుంట' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎమ్మెల్యే కందికుంట జన్మదినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నూతన సంవత్సరం, కందికుంట వెంకటప్రసాద్ జన్మదిన వేడుకలు ఒకే రోజు కావడంతో బుధవారం కదిరిలో పండుగ వాతావరణం నెలకొంది. పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథి గృహంలో టిడిపి శ్రేణులు ,అభిమానులు నడుమ కేక్ కట్ చేశారు.పలువురు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని ఎన్జీవో హోంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.


కందికుంట పుట్టినరోజు వేడుకల్లో నాయకులు

బాధితుడికి పరామర్శ

ప్రజాశక్తి - బత్తలపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న బొమ్మినేని సుధాకర్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్ బుధవారం పరామర్శించారు. బత్తలపల్లికి చెందిన సుధాకర్ అనారోగ్యానికి గురై చికిత్సలు చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో విజయ్‌కుమార్ బుధవారం కార్యకర్త ఇంటికి వెళ్లిఆరోగ్య విషయాలు యోగక్షేపాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఇన్‌ఛార్జి పల్లపోతుల శ్రీరాములు, గడ్డం వెంకటనారాయణ, జాస్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్లైన్లో పొందుపరిచిన పదవ తరగతి ఒకేషనల్ వికలాంగుల విద్యార్థుల సర్టిఫికెట్లను డీఈవో కార్యాలయంలో జనవరి 4వ తేదీ లోపల అందచేయాలని డీఈవో కిష్టప్ప తెలిపారు. కార్యాలయంలో జిరాక్స్ పత్రాలు ఇచ్చి ఒరిజినల్స్ తీసుకెళ్లాలన్నారు. ఇవి ఇవ్వకపోతే తదుపరి విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం పరీక్షల సంచార కార్యాలయంలో ధ్రువీకరించుకోవాల్సి ఉంటుందన్నారు.

'పది' మోడల్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని కేజీబివిలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులకు గైడులు, మెటీరియల్‌ను కదిరి రూరల్ సీఐ నాగేంద్ర చేతుల మీదుగా అందజేశారు. కదిరి శాసనసభ్యులు కంది కుంట వెంకటప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా స్థానిక ముప్పై పడకల ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పాలు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఒ షాహిదా, ఎస్ఐ గోపీ, టిడిపి నాయకులు నాగేంద్రప్రసాద్, దామోదర్, మురళీ, టిఎన్ఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్మాన్, తెలుగు యువత జిల్లా కో ఆర్డినేటర్ ముద్దం శెట్టి శివశంకర్ నాయుడు, రెడ్డప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగరాజుపల్లి గ్రామంలో వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గర్భిణులు, చిన్న పిల్లలకు ఇవ్వవలసిన వ్యాధి నిరోదక టీకాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, హెల్త్ సూపర్ వైజర్ చంద్రకళ, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, ఆశా కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి - లేపాక్షి

మండలపరిధిలోని చోళ సముద్రం గ్రామంలో బుధవారం వైసిపి మండల కన్వీనర్ నారాయణ స్వామి జన్మదిన వేడుకలను కోడిపల్లి సర్పంచ్ మంజునాథ్, లేపాక్షి సర్పంచ్ ఆదినారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌడేశ్వరి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లీలావతి, కూతల శ్రీనివాసులు, పిసి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కిరీటం వితరణ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీనివాస నగర్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహానికి అలంకరించడానికి కిరీటాన్ని దాత వితరణ చేశారు. ఈనెల 10వ తేదీ నిర్వహించబడే వైకుంఠ ఏకాదశి వేడుకలు సందర్భంగా దాతలు విశాలాక్షి, వజ్జల వెంకటరమణ బాబు మరియు కుమారులు వెండి కిరీటం చేయించి ఆలయ అధ్యక్షులు చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు రాజేష్ ఆచార్యులు దాతల పేరిట ప్రత్యేక పూజలు చేయించి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.